

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల జిల్లా వార్తలు 3
ఆదివారం 28 జనవరి 2024



పత్తికొండకు రా.. కదలిరా..



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, కుర్చీలు

- లక్ష మందితో నేడు భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు
- గోపాల్‌ప్లాజాలో బస చేయనున్న చంద్రబాబు

కర్నూలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)/ పత్తికొండ: పత్తికొండలో రా.. కదలిరా కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఇందుకోసం నాయకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. దాదాపు లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, కేఈ ప్రభాకర్, మాజీ మంత్రి అఖిలప్రియ దగ్గరుండి సభా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. చంద్రబాబు సభకు ఆదోని రహదారిలో టీడీపీ నాయకుడు ప్రమోద్‌కుమార్ వెంచర్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదికతోపాటు హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేశారు. బారికేడ్ల ద్వారా మహిళలకు, వీవీఐపీ, వీఐపీ, మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా గ్యాలరీలను విభజించారు. సభా స్థలానికి సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. 200 మీటర్ల దూరంలో ఉన్న హెలిప్యాడ్ నుంచి వాహనంలో చంద్రబాబు వేదిక వద్దకు చేరుకుంటారు. హెలిప్యాడ్ ఏర్పాట్లను ఆర్డీవో రామలక్ష్మి పరిశీలించగా ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు మార్కింగ్‌ను ఇచ్చి అనుమతులు మంజూరు చేశారు.

200 మంది పోలీసులతో బందోబస్తు..

బహిరంగ సభ ఏర్పాట్లతోపాటు హెలిప్యాడ్‌ను డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. కేఈ శ్యాంబాబు, అఖిలప్రియలు బహిరంగ సభ నిర్వహణపై ఆయనతో చర్చించారు. వాహనాల పార్కింగ్, వీవీఐపీల ఎంట్రీ గురించి మాట్లాడారు. బహిరంగ సభ కోసం 200 మంది పోలీసులకు విధులు కేటాయించారు. ఏర్పాట్ల పరిశీలనలో డీఎస్పీతోపాటు సీఐ మురళీమోహన్ ఉన్నారు.

నాయకులంతా అక్కడే..

పత్తికొండ సభను సక్సెస్ చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు కేఈ శ్యాంబాబు, మీనాక్షినాయుడు, కోట్ల సుజాతమ్మ, బీవీ జయనాగేశ్వరరెడ్డి, తిక్కారెడ్డి, గౌరు చరిత, టీజీ భరత్, ఆకెపోగు ప్రభాకర్ తదితరులు కృషి చేస్తున్నారు. ప్రతి మండలం, పల్లె నుంచి చలో పత్తికొండకు పిలుపునిచ్చారు. అదే క్రమంలో మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబుతోపాటు జిల్లా సమన్వయకర్త ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి ఆధ్వర్యంలో సభా ఏర్పాట్లు పూర్తి చేశారు.

చంద్రబాబు పర్యటన వివరాలు ఇలా..

చంద్రబాబు నాయకుడు నెల్లూరు నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3:50 గంటలకు పత్తికొండకు చేరుకుంటారు. 3:55 గంటలకు హెలిప్యాడ్ నుంచి వాహనంలో బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. 4 గంటలకు వేదికపైకి చేరుకుని 5:50 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. 6 గంటలకు హంద్రీనీవా సమీపంలో ఉన్న గోపాల్‌ప్లాజాకు చేరుకుని అక్కడే రాత్రి బస చేస్తారు. 29వ తేదీ ఉదయం 9:30 గోపాల్‌ప్లాజా నుంచి వాహనంలో హెలిప్యాడ్ వద్దకు బయలుదేరుతారు. 9:40 గంటలకు హెలికాప్టర్‌లో కర్నూలు ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు. 10 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్టులో దిగి అక్కడి నుంచి 10:05 గంటలకు విమానంలో రాజమండ్రికి వెళ్తారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ కేఈ కృష్ణమూర్తి

పత్తికొండకు తరలి రండి

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి దీపక్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దీపక్ రెడ్డి, బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), జనవరి 27: పత్తికొండలో నిర్వహిస్తున్న చంద్రబాబు సభకు తరలి రావాలని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి దీపక్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను వైసీపీ ద్రోహం చేసిందని అన్నారు. కోట్లాది రూపాయల ధనాన్ని తన ప్రచారం కోసం జగన్ ఉపయోగించుకుని రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చి వేశారని దుయ్యబట్టారు. సమావేశంలో బీసీ సెల్ నాయకులు సత్రం రామకృష్ణ, తిరుపాలుబాబు, హనుమంతరాయచౌదరి, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ గద్దె దిగిపోవడం ఖాయం

మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి

పత్తికొండ టౌన్, జనవరి 27: సీఎం జగన్మోహన్‌రెడ్డి గద్దె దిగిపోవడానికి సిద్ధమయ్యారని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి అన్నారు. శనివారం పత్తికొండలోని ప్రమోద్‌కుమార్‌రెడ్డి వెంచర్‌లో నిర్వహించే రా కదలి రా చంద్రబాబు పర్యటన సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ పాలన అస్తవ్యస్తంగా తయారైందన్నారు. తాను ఉప ముఖ్యమంత్రి ఉన్న సమయంలో పత్తికొండ నియోజకవర్గంలోని చెరువులకు నీరు మళ్లించడంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టానని గుర్తు చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన గురించి ప్రజలకు వివరించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పత్తికొండకు వస్తున్నారని తెలిపారు. బహిరంగ సభకు లక్ష మందికి పైగా జనం వస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వైసీపీని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు కూడా సిద్ధమయ్యారన్నారు. మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ చంద్రబాబు పత్తికొండకు చాలా ప్రాధాన్యత ఇస్తారని, అందుకే కర్నూలు పార్లమెంటరీ పరిధిలో పత్తికొండనే ఎంచుకున్నారని అన్నారు. వచ్చే ఎన్నికలలో కర్నూలు పార్లమెంటరీ సభ, ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని చంద్రబాబుకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ పత్తికొండలో తలపెట్టిన చంద్రబాబు సభను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. వేలాదిగా తరలి వచ్చే జనానికి ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్, భోజనం, నీటి వసతులలో లోటుపాట్లు లేకుండా చూస్తామని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భార్గవ్, వలసల రామకృష్ణ, తిరుపాలునాయుడు, బత్తిన లోక్‌నాథ్, అశోక్‌కుమార్, గురుస్వామి, మనోహర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులపై చిత్తశుద్ధి ఉందా?

- వైసీపీ నేతలకు గౌరు చరిత సూటి ప్రశ్న
- గోరుకల్లు రిజర్వాయర్ పరిశీలన



గోరుకల్లు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, జనవరి 27: సాగునీటి ప్రాజెక్టులపై జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా? అంటూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వైసీపీ నాయకులను ప్రశ్నించారు. గోరుకల్లు రిజర్వాయర్ ఓటి స్లూయిస్ వద్ద కుంగిన రాతిపరుపును టీడీపీ, జనసేన పార్టీల నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గత ఏడాది మే నెలలో రిజర్వాయర్ రాతిపరుపు కుంగడంతో రూ.1.50 కోట్లతో మరమ్మతులు చేపట్టినా నాణ్యత లేకపోవడంతో మళ్లీ కుంగిందన్నారు. రిజర్వాయర్ మట్టికట్టతోపాటు మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.99 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు ప్రభుత్వం పైసా విదిల్చకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. అలగనూరు రిజర్వాయర్ గండి పూడ్చడానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు నిధులు ఎందుకు మంజూరు కాలేదన్నారు. తూతూమంత్రంగా మరమ్మతులు చేయడంతో నాణ్యత కొరవడుతోందన్నారు. అనంతరం ఆమె సీఈ కబీర్‌తో చర్చించి రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోరుకల్లు జేఈ అమృత్, టీడీపి నాయకులు జయరామిరెడ్డి, జనసేన నాయకులు జగదీశ్, రామ్మోహన్‌నాయుడు, నంద్యాలరవి, గంగా నారాయణ, కేశవ్, సురేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే షెడ్డు కూల్చివేత

- 8 సెంట్ల ఖరీదైన ప్రభుత్వ స్థలం కబ్జా
- వైసీపీ నాయకుడి దురాగతం
- నోరు మెదపని అధికార యంత్రాంగం

గోస్పాడు, జనవరి 27: అమరావతిలో ప్రజా వేదికను కూల్చిన జగన్‌ను ఆదర్శంగా తీసుకున్నారేమో.. అదే తరహాలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రం షెడ్డును వైసీపీ నాయకులు కూల్చి వేశారు. రాత్రికి రాత్రే షెడ్డును నేలమట్టం చేయడం గోస్పాడు మండలంలో తీవ్ర దుమారం రేపింది. మండలంలోని పసురుపాడు గ్రామంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018- 19లో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో చెత్త సంపద సృష్టి కేంద్రం నిర్మాణంలో భాగంగా షెడ్డును నిర్మించారు. సంపద సృష్టి కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ తదనంతరం వైసీపీ అధికారంలోకి రావడంతో సంపద సృష్టి కార్యక్రమాలకు బ్రేక్ పడింది.

ఖరీదైన స్థలంపై వైసీపీ నాయకుల కన్ను

పసురుపాడు గ్రామంలో గతంలో కొంత మంది అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చారు. వీటికి సమీపంలోనే చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం షెడ్డు ఉంది. ప్రస్తుతం ఇక్కడ సెంటు స్థలం రూ.2 లక్షలకు పైమాటే. దాదాపు 8 సెంట్ల స్థలం రూ.16 లక్షలకుపైగా విలువ చేసే షెడ్డు ఉన్న స్థలంపై వైసీపీ నాయకుల కన్ను పడింది. ఇదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు ఇటీవల గ్రామానికి గడప గడపకు వచ్చిన ప్రజాప్రతినిధికి చెప్పాడు. ఎలాగైనా చేజిక్కించుకునేందుకు అండగా ఉండాలని కోరి ఆ మేరకు షెడ్డు కూల్చివేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రికి రాత్రి షెడ్డును పునాదులు, పిల్లర్లతో సహా నేల మట్టం చేయడం కలకలం రేపింది. అయితే గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, మండల అభివృద్ధి కార్యాలయం అధికారులకు విషయం తెలిసినప్పటికీ వైసీపీ నాయకులపై ఫిర్యాదు చేసేందుకు జంకుతుండడం గమనార్హం.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

పసురుపాడులో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రం షెడ్డును దుండగులు కూల్చి వేసిన విషయం మాదృష్టికి వచ్చింది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు తెలిపాం. పై అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

- నాగఅనసూయ, ఇన్‌చార్జి ఎంపీడీవో, గోస్పాడు



నేల మట్టమైన షెడ్డు

మల్లన్న సేవా టికెట్లు తారుమారు

- ఆన్‌లైన్ వ్యవస్థలో లోపాలు
- దేవస్థానం ఐటీ విభాగం పర్యవేక్షణ లోపమే కారణమా?
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో దేవస్థానం ఆన్‌లైన్ వ్యవస్థ!



తారుమారైన సేవా టికెట్లు

శ్రీశైలం, జనవరి 27: శ్రీశైలం దేవస్థానంలో మల్లన్న సేవా టిక్కెట్ల తారుమారు వ్యవహారం మళ్లీ వెలుగులోకి వచ్చింది. శనివారం హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు ఆన్‌లైన్ ద్వారా గోపూజ టికెట్టును బుక్ చేసుకుని వచ్చాడు. అయితే ఆలయంలోకి వెళ్లే సమయంలో టికెట్ స్కాన్ కాకపోవడంతో భక్తుడు అయోమయానికి గురయ్యాడు. భక్తుడు 27.01.2024 తేదీకి ఉదయం 6:30 గంటల సమయానికి సేవా టికెట్‌ను బుక్‌చేసుకుంటే అదికాస్తా గడిచిపోయిన ఏడాదిగా చూపిస్తోంది. అంటే 13.12.2023వ తేదీకి బుకింగ్ పూర్తయినట్లు చూపుతోంది. విషయాన్ని దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకుపోగా పొరపాటున పాత టికెట్టు తీసుకొచ్చాడని దాటవేశారు. దేవస్థానం వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల వల్లే ఈ టికెట్ల గోలుమాల్ జరుగుతోందని భక్తులు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో తిరుమల తరువాత అతిపెద్ద దేవస్థానమైన శ్రీశైల దేవస్థానం ఆన్‌లైన్ వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులతో కలిసి దేవస్థానం నిర్వహించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహించుకునే మల్లన్న సేవా టికెట్లు ఇలా తారుమారు కావడంపై దేవస్థానం ఐటీ విభాగం పర్యవేక్షణలోపం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. గతంలో ఇదే ఆర్జిత సేవా టికెట్ల గోల్‌మాల్ వ్యవహారంలో రూ.3.20 కోట్ల మేర అక్రమాలు జరిగిన విషయం తెలిసిందే. అప్పట్లో ఉన్నతాధికారులు 11 మంది రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మళ్లీ ఇప్పుడు టికెట్ల తారుమారు వ్యవహారం తెరమీదకి రావడంతో మళ్లీ ఏదైనా అక్రమాలు జరుగుతున్నాయా? అన్న అనుమానాలు భక్తుల్లో వ్యక్తమవుతున్నాయి.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి
- నంద్యాలలో రాయలసీమ నిజ దర్శనం దీక్ష



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, జనవరి 27: రాయలసీమ అభివృద్ధి కోసం చేస్తున్న ఉద్యమాలను అరెస్టులతో ఆపలేరని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం నంద్యాలలో సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో రాయలసీమ నిజదర్శన దీక్షను నిర్వహించారు. తాలుకా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దీక్ష జరిగింది. ఈ సందర్భంగా దీక్షలో రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై బొజ్జాతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాల తీరును నిరసిస్తూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ అరెస్టులతో సీమ ఉద్యమం వెనుకడుగు వేయబోదని హెచ్చరించారు. శ్రీబాగ్ ఒప్పందం జరిగిన కాలం నుంచి నేటి వరకు రాయలసీమ జిల్లాల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమలో రాజధాని లేదా హైకోర్టు, కృష్ణానది జలాల్లో ప్రముఖ ప్రాధాన్యత, విద్యాసంస్థల ఏర్పాటు, శాసన సభ స్థానాల్లో సమాన నిష్పత్తి, తదితర అంశాల అమలుకు రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. వచ్చే శాసన సభ ఎన్నికల సందర్భంలో అన్ని రాజకీయ పార్టీలు తమ తమ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో రాయలసీమ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిజదర్శన దీక్షలో పాల్గొన్న పలు ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రజా మ్యానిఫెస్టోను తయారు చేసి కీలకమైన అంశాలతో రాజకీయ పార్టీల అధ్యక్షులకు ఇచ్చి రావాలని సదస్సులో నిర్ణయించారు. ఫిబ్రవరి మొదటి వారంలో కర్నూలు, అనంతపురం, కడప, తిరుపతి కేంద్రాలలో రాయలసీమ దీక్షా కార్యక్రమాలను చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, జలసాధన సమితి నాయకుడు చైతన్య గంగిరెడ్డి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

జయ జయ శంకర..

- వైభవంగా నీలకంఠేశ్వరుడి రథోత్సవం
- భక్త జనంతో పులకరించిన ఎమ్మిగనూరు



అశేష జనవాహిని నడుమ సాగుతున్న రథోత్సవం (ఇన్‌సెట్‌లో... స్వామివారు)



రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు




యువత కోలాహలం

ఎమ్మిగనూరు, జనవరి 27: భక్తుల శివనామస్మరణ మధ్య నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. భక్తులు భారీగా తరలి రావడంతో ఎమ్మిగనూరు పట్టణం కిక్కిరిసింది. తేరుబజారు ప్రాంతం జనసంద్రమైంది. రథ వీధులన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. పండితులు వేదమంత్రాలను వల్లిస్తుండగా ఆది దంపతులను భక్తి శ్రద్ధలతో మహా రథంపైకి చేర్చారు. రథోత్సవ ముహూర్తం ప్రారంభం కాగానే ఒక్కసారిగా వేలాది మంది భక్తులు హరోం..హర.. శంభోశంకరా.. జయహో నీలకంఠేశ్వరా.. అంటూ నినదించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ధర్మకర్త ఎద్దులింటి మురళీధర్ ఆధ్వర్యంలో ఆలయం నుంచి ఉత్సవమూర్తులను పల్లకిలో రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మేళతాళాలతో గడిగే చెన్నప్ప కుటుంబీకులు కుంభం తీసుకొచ్చారు. రథ చక్రాలు మార్కండేయుడి గుడి వైపు 6:05 గంటలకు కదిలాయి. 6:10 గంటలకు మార్కండేయుడి సన్నిధానానికి రథం చేరింది. అక్కడ పూజలు చేసి 6:26 గంటలకు రథం యథాస్థానానికి చేరడంతో రథోత్సవం ముగిసింది. నీలకంఠేశ్వరస్వామి రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పర్యవేక్షణలో సీఐలు మధుసూదన్‌రావు, మోహన్ రెడ్డి బందోబస్తును నిర్వహించారు.

జయహో బీసీకి జై

- గ్రామాల్లో విస్తృతంగా పర్యటనలు
- టీడీపీ కార్యక్రమానికి విశేష ఆదరణ
- బీసీలతో మమేకమవుతున్న నాయకులు
- వైసీపీ విధానాలను ఎండగడుతున్న వైనం





కర్నూలు(అర్బన్), జనవరి 27: జగన్‌ను ఇంటికి పంపేందుకు బీసీలు సిద్ధమయ్యారా.. కూడు, గూడు, నీడ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారా.. ప్రస్తుత పరిణామాలు అవుననే చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 68 శాతం బీసీ జనాభా ఉండడంతో రెండు జిల్లాల టీడీపీ అధ్యక్షులను ఆ సామాజిక వర్గానికి చెందిన వారినే అధిష్టానం నియమించింది. ఈ నిర్ణయంతో టీడీపీకి మరింత బలం చేకూర్చినట్టయింది. దీనికి తోడు జిల్లాలో నెల రోజులుగా గ్రామ గ్రామాన జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి బీసీని పలకరించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. వైసీపీ పాలనలో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తున్నారు. దీంతో బీసీలంతా ఏకమై ఈ సారి టీడీపీకి అండగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఆదివారం పత్తికొండలో జరగనున్న రా.. కదిలి .. రా కార్యక్రమానికి బీసీలు భారీగా తరలి రానున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు తెలిపారు.

బీసీలకు ప్రాధాన్యత పదవులు..

ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీల చూపంతా ఓటర్లలో అత్యధిక శాతం ఉన్న బీసీలపైనే పడింది. మొదటి నుంచి బీసీల పార్టీగా గుర్తింపు ఉన్న టీడీపీ ఈ విషయంలో మరింత ముందంజలో ఉందనే చెప్పవచ్చు. ఇందులో భాగంగానే కీలకమైన కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవిని వాల్మీకి కులానికి చెందిన బీటీ నాయుడికి, నంద్యాల జిల్లా అధ్యక్ష పదవీని గౌడ కులానికి చెందిన మల్లెల రాజశేఖర్‌గౌడ్‌లకు అప్పగించారు. రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్‌గా యాదవ కులానికి చెందిన నాగేశ్వరావు యాదవ్‌ను నియమించారు. మరో నేత నరసింహులు యాదవ్‌కు రాష్ట్ర కార్యదర్శితోపాటు హిందూపురం పార్టీ పరిశీలకునిగా పార్టీ అధిష్టానం నియమించింది.



కర్నూలు జిల్లాలో బీసీలు ఎక్కువ..

రానున్న ఎన్నికల్లో బీసీల ఓటు బ్యాంకును సాధించేందుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జయహో బీసీ కార్యక్రమాన్ని చేపట్టారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాలతో పోలిస్తే కర్నూలు జిల్లాలో బీసీల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇదే విషయాన్ని ఇటీవల ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల జాబితా స్పష్టం చేస్తోంది. అయితే బీసీల మద్దతు పొందాలంటే వారికి సంబంధించిన కార్యక్రమాలు రూపొందించుకొని విజయవంతం చేయాల్సిన అవసరం ఉంది. అధికారంలోకి తెలుగుదేశం పార్టీ వస్తేనే భవిష్యత్ బాగుంటుందనే నమ్మకం వారిలో కలిగేలా కార్యాచరణ ఉండాలి. బీసీలను కలుపుకొని ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై ఇప్పటికే పార్టీ అధినాయకుడు చంద్రబాబు నాయుడు నిర్దేశించారని జిల్లా పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

వైసీపీ పాలనలో నిర్వీర్యం..

వైసీపీ పాలనలో బీసీ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ఐదేళ్లు పూర్తి కావస్తున్నా వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేసింది ఏమీ లేదన్న విషయాన్ని తెలియజేసేందుకు తెలుగు దేశం పార్టీ జయహో బీసీ కార్యక్రమాన్ని తలపెట్టింది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు, ఖర్చు చేసిన నిధులపై ప్రజలకు వివరించేందుకు జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పర్యటిస్తున్నారు. బీసీల కోసం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పగా చెప్పుకుంటున్నా ప్రభుత్వం వాటికి ఏ మాత్రం నిధులు కేటాయించలేదు. ప్రశ్నించిన బీసీ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకులు అక్రమ కేసులు పెట్టిస్తున్నారు. దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. స్థానిక సంస్థల పదవుల్లో రిజర్వేషన్లు టీడీపీ 34 శాతం కొనసాగిస్తే వైసీపీ ప్రభుత్వం 24 శాతానికి కుదించింది. అదేవిధంగా పార్టీలో ప్రాధాన్యతా పదవులన్నీ జగన్‌రెడ్డి తన సామాజిక వర్గానికే చెందిన వారికి కట్టబెట్టడం ఏమాత్రం విలువ లేని పదవులను బీసీలకు కేటాయించారు. టీడీపీ చేపట్టిన జయహో బీసీ కార్యక్రమంలో ఈ విషయాలన్ని వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

టీడీపీ వైపు ప్రజలు...

జయహో బీసీ సభలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలని అన్ని వర్గాల వారు కోరుకుంటున్నారు. బీసీలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల హక్కులన్నీ హరించేశాడు. ఇక జగన్ రెడ్డి పని అయిపోయింది. ఆయన్ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. జగన్‌ను ఇంటికి పంపేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారు. అందుకే జయహో బీసీ సభలు ఎక్కడ పెట్టినా ప్రజలు భారీగా తరలివస్తున్నారు.



- బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

బీసీల్లో చైతన్యం తెస్తాం



వైసీపీలో బీసీలకు విలువ లేకుండా పోయింది. వైసీపీ బస్సు యాత్రలో బీసీలకు విలువ లేదని కర్నూలు వైసీపీ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ వెల్లడించారు. బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా క్రిష్ణ మూర్తిని సైతం మెడపట్టి బయటకు గెంటేశారు. మరో ఎమ్మెల్యే పార్థసారధి విజయవాడ సొంత స్థలం ఇచ్చి వైసిపి కోసం పని చేస్తే విలువ ఇవ్వలేదు., ఇలాంటి నాయకులను ఉదాహరణలు చూపుతూ బీసీల్లో చైతన్యం తెస్తున్నాం. టీడీపీ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ మొదటి నుంచి ప్రాధన్యాత ఇస్తూ ఎందరికో అత్యున్నత పదవుల్లో కూర్చో పెట్టిన పార్టీ. తెలుగుదేశం. అందుకే టిడిపికి మద్దతోనే బీసీలకు న్యాయం జరుగుతుంది

-వై.నాగేశ్వరావు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్

జయహో బీసీకి నీరాజనం



జయహో బీసీ కార్యక్రమానికి ఎక్కడ చూసినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. బీసీలకు వెన్ను దన్నుగా నిలిచే పార్టీ టీడీపీ అని బీసీ సామాజిక వర్గం గుర్తించింది. ఇక రానున్న ఎన్నికల్లో బీసీలు టీడీపీకి మద్దతుగా నిలువబోతున్నారు. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఎదురు చూస్తున్నారు.

- సత్రం రామకృష్ణుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు

టీడీపీతోనే బీసీలకు న్యాయం



టీడీపీలోనే బీసీలకు రాజకీయం ప్రాధాన్యత ఉంటుంది. ఉపాధి అవకాశాలు, సంక్షేమం కూడా తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం. వైసీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను బీసీలకు వివరిస్తున్నాం. జయహో బీసీ కార్యక్రమం ద్వారా వారిలో చైతన్యం వస్తోంది. గ్రామ గ్రామాన ప్రజలు చంద్రబాబు, లోకేశ్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు.

- కాసాని మహేష్ గౌడ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి

రూ.11 కోట్లతో సీ.క్యాంపు రైతుబజారు విస్తరణ

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 27: గుర్తింపు పొందిన కర్నూలు నగరంలోని సీ క్యాంపు రైతుబజారు ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రతి రోజూ కూరగాయలు కొనుగోలు చేసేందుకు నగరంలోని అన్ని కాలనీల నుంచి దాదాపు ఐదు వేల నుంచి ఏడు వేల మంది వినియోగదారులు సీ క్యాంపు రైతు బజారుకు వస్తున్నారు. గత టీడీపీ హయాంలో రైతుబజారుకు సమీపంలోనే ఉన్న రెవెన్యూ క్వాటర్స్‌లోని పది బిల్డింగులను విస్తరణ కోసం కేటాయించారు. విస్తరణ కోసం రూ.5 కోట్లను కేటాయించారు. రెవెన్యూ క్వాటర్స్‌ను కూలగొట్టి విస్తరణ పనులు చేపట్టాలంటే ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలకు రూ.5 కోట్ల నిధులు ఏ మాత్రం చాలవని మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేశారు. తాజాగా సీ క్యాంపు రైతుబజారు విస్తరణ పనుల కోసం రూ.11 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బారెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు అందగానే ముందుగా రెవెన్యూ క్వాటర్స్‌ను తొలగించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని, వాహనాల పార్కింగ్‌కు అవసరమైన చర్యలు వెంటనే చేపడతామని తెలిపారు. ఈ పనులు వెంటనే జరిగినట్లయితే.. వాహనాలన్నీ కూరగాయల కోసం వచ్చే ప్రజలు పార్కింగ్ స్థలంలోనే ఉంచుకునే అవకాశం ఉంటుంది. రద్దీ తగ్గి దొంగల బెడద కూడా తొలగే అవకాశం ఉంటుంది.

జేవీకే నిధులలో అవినీతిపై విచారణ

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 27: జేవీకే నిధులలో ఎంఈఓ ఆంజనేయులు అక్రమాలకు పాల్పడ్డారన్న విద్యార్థి సంఘాల ఆరోపణలపై డిప్యూటి డీఈఓ వెంకటరమణారెడ్డి, ఆదోని ఎంఈఓ, ప్రజెంటింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు విచారణ శనివారం చేపట్టారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నతపాఠశాలలో వారు జేవీకే నిధులు మంజూరు, ఎంఈఓ చేసిన ఖర్చులపై బిల్లులను పరిశీలించారు. బిల్లులో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికరులకు నివేదిక పంపుతామని విచారణకు వచ్చిన అధికారులు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, ఉదయ్,రామకృష్ణ, శేఖర్ డిమాండ్ చేశారు.

దోచుకోవటం.. దాచుకోవడమే జగన్ నైజం

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

పెద్దకడుబూరు, జనవరి 27: సీఎం జగన్ ఈ ఐదేళ్లలో దోచుకోవటం.. దాచుకోవటం తప్ప ప్రజలకు చేసిందేమి లేదని శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విమర్శించారు. శనివారం మండలకేంద్రమైన పెద్దకడుబూరులో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జీ పాలకుర్తి తిక్కారెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో సీఎం జగన్ ఘోరంగా విఫలమయ్యాడన్నారు. పత్తికొండలో జరిగే రా.. కదలిరా.. సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు అబ్జర్వర్ శివబాల, టీడీపీ నాయకులు రమాకాంత్‌రెడ్డి, బసలదొడ్డి ఈరన్న, ఏసేపు, దశరథరాముడు, మల్లికార్జున, మీసేవ ఆంజనేయులు, వీరేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

కర్నూలు ఎంపీడీవో ఆజామ్‌ఖాన్ మృతి

కర్నూలు(రూరల్), జనవరి 27: కర్నూలు ఎంపీడీవో కేఏ ఆజామ్‌ఖాన్(61)గుండెపోటుతో మృతి చెందారు. కర్నూలులో విధులు నిర్వహిస్తున్న ఆయన శనివారం కూడా వేకువ జామున 5గంటల ప్రాంతంలో డోన్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైలు కోసం వేచిచూస్తున్న సమయంలో గుండెపోటు వచ్చి అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే అక్కడే ఉన్న రైల్వే పోలీసులు ఆయన వద్దకు చేరుకుని ఎంపీడీవో కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆజామ్‌ఖాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఎంపీడీవోకు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎంపీడీవో స్వస్థలం శిరివెళ్ల. ఉద్యోగరీత్యా ఆయన డోన్‌లో స్థిరపడ్డారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఎంపీడీవోల బదిలీల జాబితాలో ఆజామ్‌ఖాన్‌ను అనంతపురం జిల్లాకు కేటాయించినట్లు సిబ్బంది తెలిపారు. మరో రెండు రోజుల్లో రిలీవ్ కానున్న తరుణంలో ఆకస్మికంగా మృతిచెందడం బాధాకరమని కార్యాలయం సిబ్బంది తెలిపారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఆజామ్‌ఖాన్ భౌతికాయానికి నివాళి అర్పించారు.



అజాంఖాన్ (ఫైల్)

అనుమానాస్పదంగా యువకుడి మృతి

కోసిగి, జనవరి 27: మండల కేంద్రంలోని 9వ వార్డుకు చెందిన వడ్డె రాముడు (40) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భార్య ఉలిగమ్మ, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. వడ్డె రాముడు మధ్యాహ్నం 2 గంటల సమయంలో రైల్వే గేటు సమీపంలోని బహిర్భూమికి వెళ్లాడు. 4 గంటలైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు రైల్వేగేటు వద్దకు వెళ్లి చూడగా అక్కడ బోర్లా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఎస్‌ఐ సతీష్ కుమార్ అనుమానాస్పద స్థితి మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు, భార్య ఉలిగమ్మలు మాత్రం తన భర్తను హత్య చేశారని ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య ఉలిగమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా పోటీలు

రవాణా రోడ్డు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న



సోమయాజులపల్లెలో పాఠశాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, కలెక్టర్ డా.జి.సృజన

ఓర్వకల్లు, జనవరి 27: యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర ద్వారా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని జిల్లా స్పెషల్ ఆఫీసర్, రవాణా రోడ్డు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న అన్నారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర, పాణ్యం నియోజకవర్గ స్థాయి క్రీడా కార్యక్రమంలో సెక్రటరీ, కలెక్టర్ డా.జి.సృజనతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సోమయాజుల పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ ప్రత్యేక అధికారి డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి బౌలింగ్ చేయగా.. ప్రిన్సిపల్ సెక్రటరీ బ్యాటింగ్ చేసి యువతలో స్ఫూర్తిని నింపారు. గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీలను ప్రదానం చేశారు. క్రికెట్ పోటీల్లో మూడు టీములు పాల్గొనగా.. కర్నూలు నగరానికి చెందిన టీం మొదటి స్థానం, గడివేముల జట్టు రెండో స్థానం, పాణ్యం టీమ్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. సోమయాజులపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా.. గుడ్డు, చిక్కీలు అందు తున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే 8వ తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి స్మార్ట్ బోర్డు ద్వారా ఏవిధంగా బోధిస్తున్నారో పరిశీలించారు. విద్యార్థులకు అందించిన ట్యాబుల వినియోగంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీపీవో హిమప్రభాకర్ రాజు, డీటీసీ శ్రీధర్, డీఈవో రంగారెడ్డి, ఎస్ఎస్ఏ పీవో విజయజ్యోతి కుమారి, సెట్కూరు సీఈవో పీవీ రమణ, సర్పంచ్ జయమ్మ, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

రేపు వైఎస్ షర్మిల రాక



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు

కర్నూలు(అర్బన్), జనవరి 27: జిల్లాల పర్యటనలో భాగంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం కర్నూలు జిల్లాకు రానున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నంద్యాల, కర్నూలు జిల్లాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ, బాబురావు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29వ తేదీ సోమవారం నగరంలోని తనిష్క ఫంక్షన్ హాలులో కర్నూలు, నంద్యాల జిల్లాల కార్యకర్తలు, కీలక నాయకులతో సమీక్ష ఉంటుందన్నారు. ముందుగా నంద్యాల చెక్‌పోస్టు నుంచి సీ క్యాంప్, కలెక్టరేట్ రాజవీహార్ మీదుగా తనీష్ ఫంక్షన్ హాలు వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. పీసీసీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, 14 నియోజవర్గాల కోఆర్డినేషన్ కమిటి సభ్యులు, మండల అధ్యక్షులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, జనవరి 27. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం కిక్కిరిసింది. ఈ నెల ఆఖరి శనివారం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మహాముఖ ద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కళాశాల విద్యార్థిని మృతిపై విచారణ

పాణ్యం, జనవరి 27: జిల్లాలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన విద్యార్థిని ప్రసవం, మృతి సంఘటనపై విచారిస్తున్నట్లు నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థిని కళాశాలలో మూడు నెలల క్రితం రెండో సంవత్సరంలో చేరిందన్నారు. ఈనెల 23న సంక్రాంతి సెలవుల అనంతరం తల్లిదండ్రులు విద్యార్థినిని కళాశాల హాస్టల్‌లో వదలి వెళ్లారని తెలిపారు. 26వ తేదీన విద్యార్థిని కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులకు కళాశాల సిబ్బంది సమాచారం ఇచ్చారని వివరించారు. తల్లిదండ్రులు వచ్చేలోపు బాత్‌రూంలోకి వెళ్లి తలుపు వేసుకొని ప్రసవించిందని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థినిని సమీప శాంతిరాం ఆసుపత్రికి తరలించి అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. విద్యార్థినికి తీవ్ర రక్తస్రావంతో కోలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఐలు రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలు న్యాయవాది

కర్నూలు(లీగల్), జనవరి 27: ఆలిండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన న్యాయవాది కెంగార కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం విజయవాడలో జరిగిన ఐలు రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఇంత వరకు ఈయన ఐలు రాష్ట్ర కోశాధికారిగా, కేంద్ర కమిటి సభ్యుడిగా పని చేశారు.



కెంగార కుమార్

మహిళా జైలు తనిఖీ



ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు(లీగల్), జనవరి 27: స్థానిక మహిళా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు శనివారం తనిఖీ చేశారు. అక్కడ మహిళా ఖైదీలకు అందిస్తున్న భోజన వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. అదేవిధంగా స్థానిక మార్కెట్ యార్డులో హమాలీ కార్మికులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు ఈశ్రమ్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివుడు, లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.43.20 లక్షలు స్వాధీనం

క్రిష్ణగిరి, జనవరి 27: వాహనాల తనిఖీలు చేస్తుండగా మండల పరిధిలోని అమకతాడు టోల్‌ప్లాజా వద్ద రూ.43.20 లక్షలు పట్టుబడ్డాయి. సీఐ సురేష్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు క్రిష్ణగిరి, వెల్దుర్తి పోలీసులు శనివారం రాత్రి హైదరాబాదు నుంచి అనంతపూర్‌కు వెళుతున్న ప్రైవేటు బస్సును ఆపి తనిఖీ చేశారు. అందులో ప్రయాణిస్తున్న ఎర్రగుడి సాయిప్రదీప్ వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.43.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. క్రిష్ణగిరి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకున్నారు. ఈ దాడులలో వెల్దుర్తి ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, జనవరి 27: కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గ్రామ సమీపంలో మోటారు సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. అవుకు మండలం చెర్లోపల్లె గ్రామానికి చెందిన కంబగిరి (39) కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెకు బైక్‌పై వెళ్తున్నాడు. బెలుం సమీపంలోకి రాగానే తాడిపత్రి నుంచి బనగానపల్లెకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కంబగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు.

కర్నూలులో హనీ ట్రాప్

- హైదరాబాద్ బిల్డర్‌ను కర్నూలుకు పిలిపించి దోపిడీ
- ఏడుగురు అరెస్టు.. మరో ముగ్గురి కోసం గాలింపు

కర్నూలు, జనవరి 27: సోషల్ మీడియా వేదికగా ఓ యువతి ద్వారా హనీ ట్రాప్ చేసి దోపిడీకి పాల్పడిన ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హైదరాబాదుకు చెందిన బిల్డర్ శివారెడ్డికి వరంగల్లుకు చెందిన ఓ యువతితో గతంలో పరిచయం ఉంది. ఆమెతో కొంత కాలం కలిసి మెలిసి తిరిగాడు. ఆ తర్వాత ఆమెను వదిలేయడంతో ఆ యువతి కర్నూలుకు చెందిన శ్రీనివాసరెడ్డితో పరిచయం పెంచుకుంది. శ్రీనివాసరెడ్డిని పెళ్లి చేసుకున్నట్లు సమాచారం ఉండటంతో శివారెడ్డి ఆ యువతిని బ్లాక్‌మెయిల్ చేయడం మొదలు పెట్టాడు. గతంలో తన దగ్గర ఉన్న వీడియోల ద్వారా బెదిరింపులకు పాల్పడుతుండటంతో ఆ యువతి శ్రీనివాసరెడ్డికి చెప్పింది. దీంతో మనసులో పెట్టుకున్న శ్రీనివాసరెడ్డి.. అనూరెడ్డి అనే మరో యువతి ద్వారా సోషల్ మీడియా వేదికగా శివారెడ్డిని హనీ ట్రాప్ చేశారు. శివారెడ్డి పూర్తిగా ప్రేమలో మునిగాడని తెలుసుకున్నాక కర్నూలుకు పిలిపించారు. కర్నూలు అబ్బాస్ నగర్‌లోని ఓ గదికి పిలిపించి కొట్టారు. ఆ తర్వాత ఇద్దరు హిజ్రాల సాయంతో శివారెడ్డి ఆమెతో ఉన్నట్లుగా బెదిరించి ఫొటోలు తీయించుకున్నారు. ఆ తర్వాత అతని వద్ద రిస్టి వాచ్, బంగారు చైన్ తీసుకున్నారు. వీటితో పాటు కొన్ని ప్రామిసరి నోట్లు కూడా రాయించుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత హిజ్రాలతో ఉన్న ఫొటోలు కూడా చూపించి మరోసారి బ్లాక్‌మెయిల్ చేసినట్లు సమాచారం. దీంతో శివారెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శ్రీనివాసరెడ్డిని, అనూరెడ్డిని, వీరికి సహకరించిన ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఇద్దరు హిజ్రాలు, మరో యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరందరిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వీరికి సహకరించిన మరో యువతి, ఇద్దరు వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పూర్తి విషయాలు పోలీసులు మరో రెండు రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది.

టీడీపీలోకి నెహ్రూనగర్ వైసీపీ నాయకులు



శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్, జనవరి 27: నందికొట్కూరు మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శనివారం టీడీపీలో చేరారు. అల్లూరు గ్రామంలో టీడీపీ నాయకుడు లోకానందరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ కండువా కప్పి శివానందరెడ్డి సాదరంగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. విజయ్, మహబూబ్ బాషా, మద్దిలేటి, చిన్న వెంకటేశ్వర్లు, మౌళాలి, మహేష్, రాజు, శ్రీను, వెంకటయ్య, తదితరులు టీడీపీలో చేరారు. వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీసీలు టీడీపీకి అండగా నిలవాలి'



నారాయణపురంలో బీసీలతో మాట్లాడుతున్న కంచర్ల సురేష్‌రెడ్డి

బండిఆత్మకూరు, జనవరి 27: వచ్చే ఎన్నికల్లో బీసీలు టీడీపీకి అండగా నిలవాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నారాయణపురం, చిన్నదేవళాపురం, బరకల కాలనీ గ్రామాల్లో శనివారం ఆయన బీసీలతో మాట్లాడారు. ఫిబ్రవరి 1వ తేదీన బండిఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యాన జరిగే జయహో బీసీ సమావేశానికి ప్రతి ఒక్క బీసీ సోదర, సోదరీమణులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు, కొరకంచి శంకర్, రామచంద్రగౌడ్, పాల శంకర్, అశోక్, శివనాగరాజు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 27: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని, పోరాటం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి ట.రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆత్మకూరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయినప్పటికీ ఏపీకి అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. 2014 ఎన్నికల ముందు ఏపీకి ప్రత్యేక హోదాను కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరించారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని మభ్యపెట్టి సక్రమంగా ఇవ్వలేదని ఆరోపించారు. విభజన హామీలను చాలా వరకు అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేశారన్నారు. వెనకబడిన ప్రాంతాలకు, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు నిధులు ఇవ్వలేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు ఏసురత్నం, నాగరాజు, నాగేశ్వరరావు, రణధీర్, నరసింహ, సుధాకర్, స్వాములు, రత్నమయ్య, నరసింహ నాయక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.


అన్నదాన పథకానికి విరాళం



భక్తులను సత్కరిస్తున్న దేవస్థానం కమిటీ సభ్యులు

ఆత్మకూరు, జనవరి 27: ఆత్మకూరు పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన నిర్వహణకు శనివారం పట్టణానికి చెందిన నరహరి సత్యనారాయణ, రాధ దంపతులు రూ.50,116 విరాళాన్ని అందజేశారు. విరాళ సొమ్మును దేవస్థానం కమిటీ గౌరవాధ్యక్షులు అధ్యక్షులు, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డికి, అధ్యక్షుడు రామయ్యకు అందజేశారు. ఈసందర్భంగా దేవస్థానం కమిటీ వారు భక్తులను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు మాట్లాడుతూ దివంగత నరహరి నరసింహయ్య జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో చేపల మృత్యువాత



మృత్యువాత పడ్డ చేపలు

శ్రీశైలం, జనవరి 27: శ్రీశైలం జలాశయం ముందు భాగంలోని కృష్ణా నదిలో నాలుగు రోజులుగా చేపలు మృత్యువాత పడుతున్నాయి. చేపలు చనిపోవడంతో స్థానిక లింగాలగట్టులోని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో చేపలు మృత్యువాత పడడంపై నీటిలో ఏమైనా కలిసిందా అని మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ పవర్‌హౌస్ ఎస్ఈ పరిశీలించారు. సుండిపెంట గ్రామపంచాయతీ వెల్ఫేర్ అధికారి నీటి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అయితే పెద్ద సంఖ్యంలో మత్స్యసంపద కోల్పోయామని, తమ జీవనోపాధికి ఆర్థిక సాయం అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

షాదీఖానా పూర్తయ్యేదెన్నడో?

● నిధులు లేక నిలిచిపోయిన పనులు



కొత్తపల్లిలో నిలిచిపోయిన షాదీఖానా నిర్మాణం

కొత్తపల్లి, జనవరి 27: కొత్తపల్లి గ్రామ శివారులో 2003లో టీడీపీ ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా సీతారామిరెడ్డి హయాంలో ముస్లిం మైనార్టీ నిధులతో షాదీఖానా నిర్మాణాన్ని ప్రారంభించారు. అప్పట్లో మొదటి విడతలో సుమారు రూ.7 లక్షల నిధులు కేటాయించి పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో గుత్తేదారులకు పనులు అప్పగించి అప్పట్లోనే 50 శాతం పనులు పూర్తి చేశారు. 2004లో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో షాదీఖానా నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం, మళ్లీ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించడంతో షాదీఖానా నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. అప్పట్లో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం చేపట్టిన షాదీఖానా పనులు పూర్తి చేయకుండానే మధ్యలో నిలిపివేయడంపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోనే కొత్తపల్లి వెనుకబడిన మండలం కావడంతో నాటి మండల ముస్లింల అభ్యర్థన మేరకు షాదీఖానాను మంజూరు చేశారు. నాటి నుంచి నేటి వరకు పాలకుల అలసత్వ కారణంగా 20 ఏళ్లుగా షాదీఖానా నిర్మాణం పూర్తి కాకపోవడంతో ముస్లింలు ఇళ్ల వద్ద వివాహాలు చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముస్లింలపై చిన్న చూపు



పాలకులకు ముస్లింలపై చిన్నచూపు ఉండటం వల్లే 20 ఏళ్లుగా కొత్తపల్లిలో షాదీఖానా నిర్మాణం పూర్తి కాలేదు. సీఎం జగన్ నిర్మాణంలో ఉన్న షాదీఖానాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేస్తామని చెప్పి పట్టించుకోలేదు. షాదీఖానా నిర్మాణం పూర్తయ్యేలా పాలకులు కృషి చేయాలి.

- జహరుల్లా, నందికుంట, ముస్లిం నాయకుడు

బీసీల పార్టీ తెలుగుదేశం: మాండ్ర



అభివాదం తెలుపుతున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు జనవరి 27: బీసీల పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శనివారం మిడ్తూరు మండల కేంద్రంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మిడ్తూరు మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్‌కు ఒక్క చాన్స్ ఇవ్వడంతో రాష్ట్రం 20 ఏళ్ల అభివృద్ధి వెనక్కి వెళ్లిందని అన్నారు. మరోసారి జగన్‌ను నమ్మి ఓటు వేస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. రైతులను నట్టేట ముంచుతూ ఆదాయ వనరుగా మార్చుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్ ఒక మీటరు ఖరీదు రూ.3 వేలు అయితే సీఎం జగన్‌కు భాగం ఉన్న ఓ ఎలక్ట్రికల్స్ కంపెనీ ద్వారా రూ. 36 వేలకు కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలా రైతుల రక్తాన్ని పీల్చుతున్న జలగ జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టునైనా తీసుకువచ్చి ఎకరం భూమినైనా తడిపారా? అని ఆయన ప్రశ్నించారు. అలగనూరు రిజర్వాయర్‌కు రూ.2 కోట్లు అవసరం కాగా... నాలుగేళ్లుగా నిర్మాణం చేయకుండా గాలికి వదిలేశారన్నారు. దీంతో నేడు ఆ ప్రాజెక్టు నిర్మాణం పనులకు రూ.30 కోట్లు అవసరం అవుతుందన్నారు. నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాల నిర్వహణ ఖర్చులు ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీలకు రాజకీయ భవిష్యత్తును కల్పించిన పార్టీ టీడీపీ అని అన్నారు. బీసీల రక్షణ కోసం 2024 ఎన్నికలలో విజయం సాధించాక రక్షణ చట్టాన్ని టీడీపీ తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తిరుపాలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుండం రణారెడ్డి, మండల కన్వీనర్ ఖాతా రమేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, గిరీశ్వర్‌రెడ్డి, నాయకులు వంగాల శివరామిరెడ్డి, లాడెన్, పైపాలెం శ్రీనివాసరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్

గోస్పాడు, జనవరి 27: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, దౌర్జన్యాలను, అరాచకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లాయర్ బాబు సూచించారు. శనివారం మండల కేంద్రంలో గోస్పాడు మండల క్లస్టర్, యూనిట్, పోలింగ్ బూతుల ఇన్‌చార్జిలు, సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ టీడీపీ యాప్, కొత్త ఓటర్ జాబితాను పరిశీలన, కుటుంబ సాధికారక సారథులు, టెలిగ్రామ్ బాట్‌లో చేయాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని, కార్యకర్తలు ఎలాంటి భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి టీడీపీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, పల్లె విశ్వనాథ్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, పెద్దహుసేన్‌సాబ్, కానాలపల్లె గోవిందరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎం కృష్ణాపురం మురళీకృష్ణ, జిల్లెల్ల శంకర్‌రెడ్డి, జూలేపల్లె ఓబుల్‌రెడ్డి, నాగులారం సుధాకర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేసిన ఫౌండేషన్ చైర్మన్ ప్రభు ఇమ్మానియేలు

నంద్యాల నూనెపల్లె, జనవరి 27: నంద్యాలలోని పొన్నాపురంలో ఉన్న ఇమ్మానియేలు ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఇండియన్ ఆర్మీ సోల్జర్ మద్దిరాల ప్రసాద్, ట్రస్ట్ ఫౌండర్ డా.ఎల్.ఇమ్మానియెల్, చైర్మన్ డా.ఎల్.ప్రభు ఇమ్మానియేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల్లో దేశభక్తి భావాలు పెంపొందించుకోవాలని సూచించారు. నేటి పౌరులే భారత నిర్మాతలు అని అన్నారు. అలాగే విద్యార్థుల అభ్యున్నతికి దాతలు అందించే సహాయ సహకారాలను వినియోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ డా.రత్న ఇమ్మానియెల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జనవరి 27: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ విభాగంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఫౌజియా కరీం ఫౌండేషన్ సహకారంతో శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, సంస్థ చైర్మన్, రిటైర్డు చీఫ్ ఇంజనీర్ అబ్దుల్ కరీం ఉపకార వేతనాలను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల్లో బాలికా విద్యాభివృద్ధి కోసం తమ సంస్థ ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి ఉర్దూ విభాగంలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ఉపకార వేతనాలను అందించినట్లు వివరించారు. అంతేకాకుండా ప్రైవేట్ అధ్యాపకులకు కూడా సంస్థ ద్వారానే రూ.2.60లక్షల వేతనాలను అందించినట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీ విద్యార్థినులు చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల బాలికా విద్యాభివృద్ధి కోసం ఫౌజియా కరీం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'జయహో బీసీ సభను జయప్రదం చేయాలి'

ఆత్మకూరురూరల్, జనవరి 27: ఈ నెల 31న అమలాపురం గ్రామంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే జయహో బీసీ సభను జయప్రదం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాదరెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా పిలుపునిచ్చారు. మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బీసీ సంఘాల నాయకులను, ప్రజలను కలిసి బీసీ సభలో పాల్గొనాలని వారిని ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలపై దాడులు, దౌర్జన్యాలు అధిక మయ్యాయని ఆరోపించారు. బీసీల అభ్యున్నతి కోసం తమ నేత చంద్రబాబు మిని మేనిఫెస్టోను రూపొందించి వారికి అండగా నిలుస్తారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవీంద్రబాబు, నాగార్జున శ్రీనివాసులు, నాగార్జున, ఎస్తేరయ్య, పుల్లారెడ్డి, వెంకటరావు షఫీ ఉన్నారు.

'వైఎస్ షర్మిల పర్యటనకు ఏర్పాట్లు'

నంద్యాల టౌన్, జనవరి 27: కర్నూలులో సోమవారం జరిగే ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి వస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటనకు భారీ ఏర్పాట్లు చేసినట్లు నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా కార్యకర్తల విస్తృత సమావేశానికి షర్మిలతో పాటు ఏఐసీసీ సీడబ్ల్యూసీ సభ్యులు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పలువురు రాష్ట్ర నాయకులు వస్తున్నట్లు తెలిపారు. కడప జిల్లా నుంచి వస్తున్న నేపథ్యంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ వద్ద భారీగా స్థానిక కాంగ్రెస్ నాయకులతో స్వాగతం ఏర్పాట్లు చేశామని అన్నారు. నంద్యాల మీదుగా కర్నూలుకు చేరుకోవడం జరుగుతుందని, కర్నూలు నగరంలో నంద్యాల చెక్‌పోస్టు వద్ద జీన్, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలుకుతారని చెప్పారు. నంద్యాల జిల్లా నుంచి అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు ఉమ్మడి జిల్లా విస్తృత సమావేశానికి తరలి రావాలని లక్ష్మీనరసింహ పిలుపునిచ్చారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

గడివేముల, జనవరి 27: రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడా పోటీలకు రాజరాజేశ్వరి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వైష్ణవి ఎంపికైనట్లు శనివారం కరస్పాండెంట్ రామేశ్వరరావు తెలిపారు. కర్నూలులో జనవరి 26న జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో అండర్-17 బాలికల విభాగంలో క్రికెట్ క్రీడలో వైష్ణవి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని చెప్పారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన వైష్ణవిని పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు, ఏవో రాఘవేంద్రరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

'కార్యకర్తలకు అండగా ఉంటాం'

నంద్యాల (నూనెపల్లె), జనవరి 27: బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటానని నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. కొన్ని రోజుల క్రితం మండలంలోని గుంతనాల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ఆనందరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అభిరుచి మధు శనివారం గుంతనాలకు వెళ్లి ఆనందరావును, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. గ్రామ పెద్దలను కలిసి ఆయన మాట్లాడారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



బుక్కాపురం రోడ్డు పక్కనే ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం

మహానంది, జనవరి 27: మహానంది మండలం బుక్కాపురం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం వల్ల ప్రమాదం పొంచి ఉంది. దీంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. నంద్యాల-మహానంది ప్రధాన రహదారిలోని మార్గమధ్యంలో ఉండే బుక్కాపురం కల్వర్టు పక్కనే ఇనుప విద్యుత్ స్తంభం ఉంది. వాహనదారులు ఎదురుగా వాహనం వస్తే విద్యుత్ స్తంభం ఎక్కడ తగులుతుందోనని హడలెత్తిపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి ప్రజలు తెచ్చినా ఫలితం లేకపోయిందని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఇదే రహదారిలో మహానంది క్షేత్రం ఉండటంతో నిత్యం వేలాది మంది భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ వాహనాల ద్వారా వస్తుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రమాదం జరగక ముందే ముందు జాగ్రత్త చర్యలో భాగంగా బుక్కాపురం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

మద్దిలేటి స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు



హైకోర్టు న్యాయమూర్తులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

బేతంచెర్ల, జనవరి 27: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జిల్లా జడ్జి శ్రీనివాసరెడ్డిలు శనివారం మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడులు వేద పండితులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులకు తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సన్మానించారు. వీరి వెంట జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, నంద్యాల జిల్లా, డోన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ అడిషినల్ అధికారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.58 లక్షలు: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.58 లక్షలు సమకూరినట్లు ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రరావు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.3,58,436 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

1న ఓంకార క్షేత్రంలో బహిరంగ వేలం

బండిఆత్మకూరు, జనవరి 27: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో వివిధ రకాల అమ్మకాలకు ఫిబ్రవ 1వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రస్తుత శివరాత్రి పండుగకు 5 రోజుల ముందు నుంచి 2025 శివరాత్రికి ఐదు రోజుల ముదు వరకు ఏడాది కాలానికి టెంకాయలు, కూల్ డ్రింక్స్, ఐసు అమ్మకాలు, పాదరక్షల భద్రతకు వేలం పాటలు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు రూ.10 వేల ధరావత్తు చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వేలం పాటలో హెచ్చు పాటదారుడు పాట ముగిసిన వెంటనే పూర్తి మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గత రాబడి కన్నా తక్కువ వేలం వచ్చినా, దేవదాయ శాఖకు సమ్మతి కలిగిన పాట లభించకపోయినా సదరు వేలం పాటను రద్దు చేసే అధికారం దేవస్థానం అధికారులకు ఉంటుందని తెలిపారు.

మద్యం స్వాధీనం

మహానంది, జనవరి 27: మండలంలోని బుక్కాపురంలో కుంచపు వెంకటేశ్వర్లు నుంచి 38 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం గ్రామంలో వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బంది సాయంతో దాడులు నిర్వహించారు. మద్యం స్వాధీనం చేసుకొని వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

ఆత్మకూరు, జనవరి 27: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభమైన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడలు శనివారం ముగిశాయి. ఈ క్రీడల్లో ఆత్మకూరు అర్బన్, రూరల్‌తో పాటు శ్రీశైలం మండలాన్ని కలిపి ఆత్మకూరు మండల జట్టుగా ఏర్పాటు చేయగా, మిగిలిన వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల నుంచి జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. బాలుర, బాలికల విభాగాల్లో వేర్వేరుగా క్రికెట్, ఖోఖో, కబడ్డి, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్ క్రీడలకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో నాలుగు రోజుల పాటు పోటీలను నిర్వహించారు. ఆయా క్రీడల్లో గెలుపొందిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి జ్ఞాపికలతో కూడిన బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లోని క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, కమిషనర్ శ్రీనివాసరావు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

గడివేముల, జనవరి 27: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. ఎంపీపీ నాగమద్దమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో కొన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మిగిలిన శాఖల అధికారులు తమశాఖల ప్రగతి నివేదికలను ప్రజా ప్రతినిధులకు వివరించలేదు. వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లలో నీరు తగ్గి తాగునీటి సమస్య తలెత్తుతుందని, కొత్త బోర్లను వేయించాలని గడివేముల ఎంపీటీసీ మహేశ్వర్‌రెడ్డి కోరారు. బిలకలగూడురు ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టు విషయంపై ఎమ్మెల్యే కాటసాని ఎంఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ జొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, డిప్యూటీ తహసీల్దార్ గురునాథం, వ్యవసాయశాఖ మండల అధికారి హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్యంపై దృష్టి సారించాలి'

మహానంది, జనవరి 27: గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని రెడ్డి సూచించారు. శనివారం మహానంది మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ శివనాగజ్యోతి అధ్యక్షతన తిమ్మాపురం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో దోమల బెడద అధికమయిందన్నారు. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే వచ్చే వేసవి కాలం నీటి సమస్య రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను బట్టి నిధులు మంజూరు చేసామని అన్నారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ జగనన్న గృహాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కేటాయించాలని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి దృష్టికి తీసుకొని రాగా లే అవుట్ ప్రకారం తమ్మడపల్లి, బుక్కాపురం, తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉన్న తిమ్మాపురంలో ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

పాణ్యం, జనవరి 27: స్థానిక తిరుమలగిరి ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల బైర్‌మల్ వీధికి చెందిన దుద్యాల ధనలక్ష్మి (54) మృతి చెందినట్లు పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపారు. తిరుమలగిరిలోని తన ఇంటికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా నంద్యాల వైపు నుంచి కర్నూలు వైపు వెళ్లే కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంట నష్టంపై కేసు నమోదు

ఉయ్యాలవాడ, జనవరి 27: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన తాతిరెడ్డి రామసుబ్బారెడ్డికి చెంది వరి పంటకు గడ్డి మందుకొట్టి నష్ట పరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 అక్టోబరు 2వ తేదీన ఆదే గ్రామానికి చెందిన చెన్నూరు మహేశ్వరరెడ్డి తన అనుచులైన చింతకాయల వేణు, తలారి నాగేశ్వరరావు, ఇండ్ల వెంకటరమణ, జగన్‌మోహన్, నాగరాజులతో కలిసి గడ్డి మంది పిచికారీ చేసినట్లు రామసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వ్యవసాయ అధికారులు పరిశోధనలు జరిపారు. గడ్డి మందు వల్లె వరిపంట దెబ్బతిన్నట్లు రిపోర్టు ఇచ్చారు. వారి రిపోర్టు ఆధారంగా ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. పంట దెబ్బతినటం వల్ల రూ. 75 వేలు నష్టం వచ్చినట్లు ఫిర్యాదులో తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నామమాత్రపు తనిఖీలపై ఫిర్యాదు



బహిరంగ విచారణ సభలో పాల్గొన్న అధికారులు

ప్యాపిలి, జనవరి 27: జాతీయ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలు తూతూ మంత్రంగా నిర్వహించారని మండలంలోని హుసేనాపురం గ్రామం కూలీలు అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో జాతీయ ఉపాధి హామీ పథకం పనుల బహిరంగ విచారణ సభ నిర్వహించారు. తమ గ్రామంలో కూలీలకు సక్రమంగా డబ్బులు పంపిణీ చేయలేదని, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని హుసేనాపురం కూలీలు డీడబ్ల్యూఎంఏ పీడీ రాచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. మండలంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి, పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో దాదాపు రూ.10 కోట్ల పనులు జరిగాయి. ఈ పనులకు సంబంధించి ఇటీవల అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో బయటపడిన అక్రమాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని గ్రామాల్లో పాత పనులకు బిల్లు చేశారని, మరి కొన్ని గ్రామాల్లో బోగస్ ఉపాధి కూలీల పేర్లు వెలుగు చూశాని వివరించారు. ఈ తనిఖీల్లో రూ.1.5 లక్షలు అక్రమాలు జరిగాయని అధికారులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన నిధులను తిరిగి చెల్లించాలని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫజుల్ రహిమాన్, ఏపీడీలు అన్వరా బేగం, బాలాజీ నాయక్, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి యాగంటిలో దీక్షలు

బనగానపల్లె, జనవరి 27: యాగంటిలో ఈనెల 30వ తేదీ నుంచి శివదీక్షలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డిలు శనివారం తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈదీక్షలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. మండల దీక్షలు 41 రోజులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. అలాగే అర్ధమండ దీక్షలు కూడా భక్తులు చేపడతారన్నారు.

నేడు 'జయహో బీసీ'

కొలిమిగుండ్ల, , జనవరి 27: కొలిమిగుండ్లలో జయహో బీసీ కార్యక్రమం ఆదివారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి శనివారం తెలిపారు. సదస్సుకు టీడీపీ బీసీ సెల్ నాయకులు, బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈసదస్సుకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం

డోన్(రూరల్), జనవరి 27: డోన్ సబ్ రిజిస్ట్రార్ వై.బజారిని డోన్ డాక్యుమెంటు రైటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం రోజున నంద్యాల జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సమూన్ చేతుల మీదుగా ఉత్తమ సేవలకుగాను ప్రశంసాపత్రం అందుకున్నందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ డాక్యుమెంటు రైటర్లు ఆలా మోహన్ రెడ్డి, ఇస్మాయిల్‌లు రైటర్ల తరుపున వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసి ఆయనకు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది అశోక్, లక్ష్మి, ఫరీన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

బనగానపల్లె, జనవరి 27: మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శ్రీనివాసులు (25) అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ శనివారం ఆయన మృతదేహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేశారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక ఒడిబియ్యం

చాగలమర్రి, జనవరి 27: చాగలమర్రిలోని పట్టాభి రామాలయంలో మహిళలు శనివారం భక్తిశ్రద్ధలతో సీతారాములకు సామూహికంగా ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. బియ్యం, కుంకుమ, పసుపు, రవికలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవమూర్తులకు పల్లకీ ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, వాసవీ మహిళా మండలి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'కులగణన సర్వే వేగవంతం చేయాలి'

చాగలమర్రి, జనవరి 27: గ్రామాల్లో కులగణన సర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో మహబూబ్‌దౌలా సూచించారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని 16వ వార్డులో వీఏఏ ఫరూక్, వెల్ఫేర్ అసిస్టెంట్ వసుంధర ఆధ్వర్యంలో కులగణన సర్వే చేశారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించి బయోమెట్రిక్ ద్వార ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వంద శాతం సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో వలంటీర్లు పెద్దన్న, బాలయ్య పాల్గొన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

చాగలమర్రి, జనవరి 27: గ్రామాల్లో రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఆళ్లగడ్డ వ్యవసాయశాఖ ఏడీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని నేలంపాడు గ్రామంలో శనివారం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంట నమోదుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మద్దతు ధరతో జొన్న కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ రామిరెడ్డి ఉన్నారు.

'విద్యార్థుల్లో గ్రేడింగ్ పెంచాలి'



మద్దూరు పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, జనవరి 27: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల గ్రేడింగ్ పెంచాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. మండలంలోని మద్దూరు ప్రాథమిక పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్‌బాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

'బలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి'



మాట్లాడుతున్న శెట్టి విజయకుమార్

ఆళ్లగడ్డ, జనవరి 27: వచ్చే ఎన్నికల్లో బలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, అటువంటి పార్టీకే మద్దతు ఉంటుందని ఆహోబిలం బలిజ సంఘం అన్నదాన సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయల జయంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని వైపీపీఎం కళాశాలకు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నంద్యాల జిల్లాలో అధికంగా ఉన్న బలిజలకు అసెంబ్లీ, ఎంపీ సీట్లను కేటాయించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో నంద్యాల, ఆళ్లగడ్డ నుంచి రాజకీయంగా తమ సామాజిక వర్గం నుంచి ఎవరు పోటీలో నిలిచినా వారికి అండదండలు ఉంటాయన్నారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ ఉమ్మడి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గూడూరు సంజీవరాయుడు, వైద్యుడు ఎంపీ ప్రసాద్, నల్లగట్ల బాలుడు, నరసింహుడు, సీసీ రామదాసు పాల్గొన్నారు.

జగన్‌కు ఓటమి భయం: మాజీ ఎమ్మెల్యే బీసీ

సంజామల, జనవరి 27: సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే దిగిపోతానని అంటున్నారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం సంజామల మండలంలోని హోత్రమాన్‌దిన్నె, బొందలదిన్నె, వసంతాపురం గ్రామాల్లో చేపట్టారు. బీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన గాలి వీస్తోందని, ఇది చూసి జగన్‌కు నిద్ర పట్టడం లేదని అన్నారు. ఓటమి ఖాయమని తెలియడంతో జగన్ మాటల్లో తేడా వచ్చిందని, హ్యాపీగా దిగిపోతానని ఇప్పుడు అంటున్నారన్నారు. రాష్ట్రానికి పట్టిన శని పోయేందుకు ఇంకా 74 రోజులే ఉందన్నారు. 6 భవిష్యత్ కార్యాక్రమాల గురించి బీసీ ప్రజలకు వివరించారు. వసంతాపురం, హోత్రమాన్‌దిన్నె, బొందలదిన్నె గ్రామాల్లో 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రూ.286 లక్షలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, రూ.118 లక్షలు రుణ మాఫీ కూడా చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమలపురి సర్పంచ్ విజయలక్ష్మి, నల్లగట్ల చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, దాట్ల చంద్రశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, చెన్నయ్య, నాగరాజు, శేఖర్, రవి, సుదర్శన్‌రెడ్డి, జనసే నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు: సుబ్బారెడ్డి

డోన్: వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 15వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, అబిరెడ్డిపల్లె గోవిందు, ఎస్‌ఎండీ రఫీ, చక్రపాణి గౌడు, అజీజ్, గురుస్వామి, హనుమంతురెడ్డి, పెద్దకాంతు, చిన్నకాంతు, ఉడుములపాడు నాగేంద్ర, నీలం ప్రభాకర్ పాల్గొన్నారు.



డి.వనిపెంటలో..

'వైసీపీకి పతనం తప్పదు'

చాగలమర్రి: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీకి పతనం తప్పదని టీడీపీ నాయకులు గోపాల్, బాబునాయుడు అన్నారు. మండలంలోని డి.వనిపెంట గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ కాలనీలో ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహ, గుర్రప్ప, ముసలనాయుడు, పాములేటి, గంగప్ప నాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి

బనగానపల్లె, జనవరి 27: పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని బలిజ సంఘం నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. కొండపేటలోని శివాలయంలో శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పట్టణ బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నీలిపుల్లన్న, సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు రామసుబ్బయ్య ఉపాధ్యక్షుడు మహేశ్, రాజవేఖర్, ఎస్సార్బీసీ ప్రసాద్, కృష్ణ, ఆకుల శంతనుడు, నీలి వెంకటసుబ్బయ్య, రాముడు, కొమ్ము రామకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: దొర్నిపాడులో శనివారం శ్రీకృష్ణ దేవరాయల జయంతి వేడుకలను బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంకాలమ్మ గుడి ఆవరణలో వెలసిన శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి టీడీపీ నంద్యాల పార్లమెంట్ రైతు సంఘం అధ్యక్షుడు సిద్ది సత్యం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభాషలందు తెలుగులెస్సా అని ప్రచారం చేసిన గొప్ప మహనీయులు శ్రీకృష్ణ దేవరాయలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, అమరసాని రవి, అమరసాని శేఖర్, నీలి రామారావు, జిల్లా సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, తోట సంజీవ, బాలస్వామి, జిల్లా సుబ్బరాయుడు, ప్రతాప్, శ్రీనివాసులు ఉన్నారు.



బనగానపల్లెలో శ్రీకృష్ణ దేవరాయలకు నివాళి అర్పిస్తున్న నాయకులు



దొర్నిపాడులో నివాళి అర్పిస్తున్న బలిజ సంఘ నాయకులు

ప్రజా సంక్షేమం, విద్యాభివృద్ధే ధ్యేయం: మంత్రి




బీసీ బాలుర హస్టల్ పాఠశాల భవనాలు ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల, జనవరి 27: డోన్ నియోజకవర్గంలోని ప్రజా సంక్షేమం విద్యాభివృద్ధే తన ధ్యేయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కర్నూలు రహదారిలోని గోరుమానుకొండ సమీపంలో రూ.36 కోట్లతో నిర్మిస్తున్న జ్యోతిరావు పూలే, బీసీ బాలుర హాస్టల్స్ పాఠశాలను రూ.8 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ఐటీఐ, రూ.4 కోట్లతో నిర్మించిన ఎంఎస్‌ఎంఈ నూతన భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, రహదారుల భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, ఉపాధి శిక్షణ శాఖ డైరెక్టర్ నవ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

ఆటోనగర్‌కు మంత్రి శంకుస్థాపన

డోన్: డోన్ మండలంలోని ఉడుములపాడు సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఆటోనగర్‌కు శనివారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మంత్రి బుగ్గన మాట్లాడుతూ ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 36 ఎకరాల విస్తీర్ణంలో రూ.8.58 కోట్లతో ఆటోనగర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

తుండ్లవాగు రిజర్వాయరులో తగ్గిన నీటి మట్టం



నల్లమల అటవిలోని తుండ్లవాగు రిజర్వాయరు

రుద్రవరం, జనవరి 27: నల్లమల అటవీ పరిధిలోని తుండ్లవాగు రిజర్వాయరులో నీటి మట్టం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఈ రిజర్వాయరు నుంచి హరినగరం మంచినీటి పథకానికి అనుసంధానం చేశారు. ఆళ్లగడ్డకు తాగునీటి సౌకర్యం కల్పించారు. రిజర్వాయరులో నీటి సామర్థ్యం తగ్గిపోయింది. రిజర్వాయరులో అధికారులు నీటి సామర్థ్యం పెంచి తాగునీటిని అందించాలని పలువురు కోరుతున్నారు.

నాటు సారా ఊట ధ్వంసం



గడ్డమేకల పల్లెలో నాటు సారా ఊటను ధ్వంసం చేసిన సెబ్ అధికారులు

బనగానపల్లె, జనవరి 27: మండలంలోని గడ్డమేకులపల్లె, ప్యాపిలి మండలం అలేబాద్ తండా గ్రామాల సమీపంలో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం సెబ్ అడిషనల్ ఎస్పీ జి.వెంకటరాముడు పర్యవేక్షణలో దాడులు నిర్వహించినట్లు సెబ్ సీఐ జోగేంద్ర తెలిపారు. గడ్డమే కులపల్లె గ్రామ సమీపంలో దాడులు నిర్వహించి 600 లీటర్లు నాటు సారా బెల్లం ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారా, ఒక మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు బనగానపల్లె సెబ్ అధికారులు తెలిపారు. అలాగే ప్యాపిలి మండలం అలేబాద్ తండా వద్ద నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించి 1900 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులను ఆదుపులో తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

'పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం'

రుద్రవరం, జనవరి 27: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు సంపూర ఆరోగ్యం అందించడమే ఆయుష్మాన్ భారత్ (వికసిత్) అని లక్ష్యం ఈవోపీఆర్‌డీ శ్రీనివాసశర్మ అన్నారు. శనివారం మండలంలోని చిత్రరేణిపల్లె, హరినగరం గ్రామాల్లో వికసిత్ భారత్‌పై సదస్సు నిర్వహించారు. ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, కార్యదర్శిలు ఆదిలక్ష్మి, శివకృష్ణ, ఏపీవో ప్రతాప్, ఏఈవో రాజు, నరసింహారావు, మాధవగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తులు



హైకోర్టు న్యాయమూర్తులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

బేతంచెర్ల, జనవరి 27: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జిల్లా జడ్జి శ్రీనివాసరెడ్డిలు శనివారం మద్దిలేటి నరసింహస్వామి, మహాలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రుడులు వేద పండితులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులకు తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సన్మానించారు. వీరి వెంట జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, నంద్యాల జిల్లా, డోన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, రెవెన్యూ అడిషినల్ అధికారి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.58 లక్షలు: మద్దిలేటి నరసింహ స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.58 లక్షలు సమకూరినట్లు ఈవో పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామచంద్రరావు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.3,58,436 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

పంట నష్టంపై కేసు నమోదు

ఉయ్యాలవాడ, జనవరి 27: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన తాతిరెడ్డి రామసుబ్బారెడ్డికి చెంది వరి పంటకు గడ్డి మందుకొట్టి నష్ట పరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023 అక్టోబరు 2వ తేదీన ఆదే గ్రామానికి చెందిన చెన్నూరు మహేశ్వరరెడ్డి తన అనుచులైన చింతకాయల వేణు, తలారి నాగేశ్వరరావు, ఇండ్ల వెంకటరమణ, జగన్‌మోహన్, నాగరాజులతో కలిసి గడ్డి మంది పిచికారీ చేసినట్లు రామసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వ్యవసాయ అధికారులు పరిశోధనలు జరిపారు. గడ్డి మందు వల్లె వరిపంట దెబ్బతిన్నట్లు రిపోర్టు ఇచ్చారు. వారి రిపోర్టు ఆధారంగా ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. పంట దెబ్బతినటం వల్ల రూ. 75 వేలు నష్టం వచ్చినట్లు ఫిర్యాదులో తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

బేతంచెర్ల, జనవరి 27: పట్టణంలోని ఆయా కాలనీలకు టీడీపీ నాయకులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. టీడీపీ నాయకులు షేక్షావలి చౌదరి, నారాయణస్వామి, తిరుమలేష్ చౌదరి, లోకేష్‌గౌడులు స్పందించి ఐదు ట్యాంకర్ల ద్వారా ఆయా కాలనీల ప్రజలకు తాగునీరు సరఫరా చేయించారు. నగర పంచాయతీ ట్యాంకర్ల ద్వారా కాలనీల వారికీ నీటి సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజలకు నీటి ఎద్దడి తప్పడం లేదని టీడీపీ నాయకులు ప్రజలకు తమ వంతు సొంత ఆర్థిక సహాయంతో నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేయించారు.

నేడు రంగాపురంలో విద్యుత్ కోత

బేతంచెర్ల, జనవరి 27: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ డౌలోడు విస్తరణలో భాగంగా ఆదివారం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు. ద్యుత్ వినియోగదారులు, ఫ్యాక్టరీల యజమానులు సహకరించాలని కోరారు.

'మేదరి కులస్థులను ఎస్సీ జాబితాలో చేర్చాలి'

ఆళ్లగడ్డ, జనవరి 27: బీసీలుగా ఉన్న మేదరి కులస్థులను ఎస్సీ జాబితాలో చేర్చాలని మేదరి సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మహేంద్ర డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండు వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. మహేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు మేదరి కులస్థులకు ఎలాంటి సంక్షేమ పథకాలను అందించలేదన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కార్యదర్శిగా చింతల హరి, కోశాధికారిగా లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా వీరభరత్ ఎన్నికయ్యారు.

ఘనంగా అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

ప్యాపిలి, జనవరి 27: మండలంలోని హుసేనాపురంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఫైర్‌శాఖ డీఐజీ సునీల్‌కుమార్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్‌కుమార్, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలు వేస్తున్న ఫైర్ డీఐజీ

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారు

టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన నేరేడుచెర్ల వైసీపీ కార్యకర్తలు

డోన్, జనవరి 27: వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న పాలనతో ప్రజలు విసిగిపోయారని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సుబ్బారెడ్డి సమక్షంలో నేరేడుచెర్ల గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు రాచర్ల మాధవరెడ్డి, మల్లేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటస్వామి, బాలు, గోపాల్‌తోపాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఆర్‌బీఐ నుంచి అప్పులు తెస్తేనే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితికి తెచ్చారంటే వైసీపీ పాలన ఎంత అధ్వానంగా ఉందో ప్రజలకు అర్థమైపోయిందన్నారు. పన్నుల భారంతో ప్రజలు ఎన్నో బాధలు పడుతున్నా సీఎం జగన్‌కు పట్టడం లేదన్నారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, వైసీపీని వీడి వస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు డోన్ నియోజకవర్గంలో టీడీపీని గెలిపించు కుందామని సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్యాపిలి మండల టీడీపీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, లాల్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రాజు, పెద్దరాముడు పాల్గొన్నారు.

'అధికార పార్టీకి తొత్తులుగా అధికారులు'



అధికారులను ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ హుసేన్‌బాషా

ఆళ్లగడ్డ, జనవరి 27: అధికార పార్టీ నాయకులకు అధికారులు తొత్తులుగా మారారని టీడీపీ కౌన్సిలర్ హుసేన్‌బాషా ఆరోపించారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సమావేశం చైర్మన్ రామలింగారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వీధి వ్యాపారుల నుంచి జరిమానా వసూలు చేసే కౌన్సిల్ ప్రతిపాదనను ఆయన వ్యతిరేకించారు. పాత బస్టాండులో కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించి వేసిన షెడ్లను నేటికి తొలగించలేదని విమర్శించారు. అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో వేసిన షెడ్లను వెంటనే తొలగించాలని ఆయన డిమాండు చేశారు. ఆసరా పథకంలో జరిగిన అవినీతిపై విచారణ చేయాలని కోరారు. అర్హులైన వారి ఖాతాల్లో నేటికీ డబ్బులు జమ కాలేదన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మరియమ్మ, కమిషనర్ రమేష్‌బాబు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నారసింహుడికి ప్రత్యేక పూజలు





నరసాపురంలో పల్లకిలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు, పూజలందుకున్న సర్వ లక్ష్మీనరసింహ స్వామి

రుద్రవరం, జనవరి 27: మండలంలోని నరసాపురం గ్రామ పొలిమేరలో మేళతాళాలతో ఊరేగి నరసాపురం గ్రామ పెద్దలు, అధికారులు పార్వేట పల్లకికి స్వాగతం పలికారు. పల్లకీలో నరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వామి కొలువుదీరారు. ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత వీఆర్వో కరణం సుబ్బారావు, వెంకోబరావు తదితరులు పాల్గొన్నారు.

- తిమ్మనపల్లె గ్రామంలో శనివారం పార్వేట పల్లకిలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.
- మండలంలోని రుద్రవరం, దొర్వి, నరసాపురం, గుట్టకొండ నరసింహ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

శిరివెళ్ల: నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో వెలసిన సర్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులు శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వేకువజామునే స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన నిర్వహించారు. నంద్యాల, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 27: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి, మానస లింగేశ్వర స్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మ అభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

'ఇంటర్ విద్య కీలకం'

ఆళ్లగడ్డ, జనవరి 27: ఇంటర్ విద్య విద్యార్థిని, విద్యార్థులకు కీలకమని ప్రభుత్వ వైపీపీఎం కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బన్న అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కళాశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇంటర్ ముఖ్యమన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విశ్రాంత ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు మంగపల్లెలో మెగా వైద్య శిబిరం

సంజామల, జనవరి 27: మండలంలోని మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి వైద్యశాలలో ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు గురురాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ నిర్వాహకుడు పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి శనివారం తెలిపారు. కీళ్లనొప్పులు, గుండెవ్యాధులు, ఊపిరితిత్తులు, షుగర్ బీసీ కంటి వ్యాధులు చర్మ, గొంతు, ముక్కు వ్యాధులకు సంబంధించి కర్నూలు, నంద్యాల పట్టణాలకు చెందిన వైద్యులు వైద్యశిబిరంలో పాల్గొని ఉచిత వైద్యసేవలు అందిస్తారన్నారు. ప్రజలు ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

సంజామల, జనవరి 27: స్థానిక ఎస్సీ కాలనీలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కాలనీవాసులు చక్రవర్తి, రాజు కోరారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు అనిల్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. శ్మశాన వాటిక లేక వంకలు, వాగులపై ఖననం చేస్తున్నామన్నారు. కాలనీ వాసులు అశోక్, ప్రతాప్, రాముడు, కిరణ్, శివకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు

ప్యాపిలి, జనవరి 27: మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన మౌళాలి స్వామి ఉరుసు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.



స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు